‘మినీ’పై నిర్లక్ష్యపు నీడలు!

పద్నాలుగేళ్లుగా ప్రహరీకే పరిమితమైన స్టేడియం

- కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకుంటుందా?
- అభివృద్ధికి నోచుకోక అందుబాటులోకి రాని మైదానం
- కన్నెత్తి చూడని అధికారులు, ప్రజాప్రతినిధులు


మినీస్టేడియంలో నిర్మించిన ప్రహరీ

మొయినాబాద్: క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రామానికో క్రీడా మైదానం ఏర్పాటు చేస్తున్నామని అప్పటి ప్రభుత్వం హడావిడి చేసింది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. ఈ మినీస్టేడియంపై నిర్లక్షనీడలు కమ్ముకున్నాయి. పట్టించుకునే అధికారులు కరువయ్యారు. పద్నాలుగేళ్ల క్రితం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మినీస్టేడియం ప్రహరీకే పరిమితమైంది. అభివృద్ధికి నోచుకోక, క్రీడాకారులకు అందుబాటులోకి రాకుండాపోయింది. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధిపై ప్రసంగాలు చేసే అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ఈ మినీస్టేడియాన్ని పట్టించుకోలేదు. ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడైనా మినీస్టేడియాన్ని పట్టించుకుంటుందా? లేదా? అని క్రీడాకారులు వాపోతున్నారు. మొయినాబాద్ మండల కేంద్ర సమీపంలో మినీస్టేడియం ఏర్పాటునకు 2009లో అప్పటి ప్రభుత్వం పెద్దమంగళారం రెవెన్యూలోని సర్వేనెంబర్ 356, 359లో 5ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. మినీస్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 40 లక్షలు సైతం అప్పట్లోనే మంజూరు చేసింది. ఆ నిధులతో చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ప్రహరీ నిర్మాణానికే సరిపోవడంతో అక్కడితో పనులు నిలిపేశారు.

వినియోగంలోకి రాలేదు

మొయినాబాద్‌లో నిర్మించిన మినీస్టేడియం పద్నాలుగేళ్లుగా వినియోగంలోకి రాలేదు. ప్రహరీ మాత్రమే నిర్మించి వదిలేయడంతో మైదానం క్రీడలకు అనుకూలంగా లేదు. అక్కడక్కడ గుంతలు ఏర్పడడంతో వాటిని చదును చేయకుండా వదిలేశారు. క్రీడాకారులకు భవనం, చూసేవారికోసం పెవిలియన్ వంటివి నిర్మించలేదు. దీంతో అక్కడ ఆడే పరిస్థితి లేకుండా తయారైంది. ఇటీవల మినీస్టేడియానికి ఏర్పాటు చేసిన గేట్లను సైతం గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు.

ప్రైవేటు మైదానాలవైపు క్రీడాకారులు..

మినీస్టేడియం అందుబాటులోకి రాకపోవడంతో చాలా మంది ప్రైవేటు మైదానాలకు వెళ్తున్నారు. ఇటీవలి కాలంలో మండల పరిధిలో ప్రైవేటు క్రీడా మైదానాలు విపరీతంగా పెరిగాయి. వాటిలో ఆడేందుకు క్రీడాకారులు రూ.5నుంచి 10వేలు చెల్లిస్తున్నారు. డబ్బులు కట్టలేని పేద క్రీడాకారులు తమ క్రీడలను కొనసాగించలేకపోతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చాలా మందిలో మినీస్టేడియం అభివృద్ధిపై కొత్త ఆశలు పుట్టుకొస్తున్నాయి.

ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలి..

క్రీడాకారులకు మినీస్టేడియం అందుబాటులోకి తేవాలనే ఆకాంక్షతో అప్పటి ప్రభుత్వం నిధులు కేటాయించి కొంత వరకు పనులు చేపట్టింది. ఆ తరువాత వచ్చిన తెలంగాణ ప్రభుత్వం మాత్రం దాన్ని పట్టించుకోలేదు. ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైన ఈ మినీస్టేడియాన్ని అభివృద్ధి చేసి అందుబాటులోకి తెస్తుందని క్రీడాకారులు ఆశిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయాన్ని దృష్టిలోకి ఉంచుకొని సేడియాన్ని అభివృద్ధి చేయాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

‘మహాలక్ష్మి’ని సవరించండి

ధర్మసమాజ్ పార్టీ నాయకులు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

కేశంపేట: తెల్ల రేషన్ కార్డున్న మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యానికి అనుమతించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలందరికీ ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో కార్మికులకు నష్టం చేకూరుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఉచిత బస్సు ప్రయాణం సవరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాకేశ్, రమేశ్, శివ, మహిపాల్, మల్లేశ్, శ్రీకాంత్, కృష్ణ, నరేశ్, పురుషోత్తం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే చర్యలు తప్పవు

ఆర్‌ఐ చంద్రమోహన్


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ స్థలాలను కబ్జాచేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్‌ఐ చంద్రమోహన్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ముర్తుజా గూడ సమీపంలో సర్వే నెంబర్ 551లో గుర్తు తెలియని వ్యక్తి రెండు రూమ్‌లను అక్రమంగా నిర్మించారు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న ఆర్‌ఐ చంద్రమోహన్ మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఆదేశాలతో అక్రమ నిర్మాణాలను కూల్చివేయించామన్నారు. ఈ కూల్చివేతలో మండల రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మినీ క్రిస్మస్

షాబాద్: ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు షాబాద్ మండలం మరియాపురం గ్రామంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని చర్చిలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మండలంలో అతి పెద్దదైన ఆరోగ్యమాత చర్చిని దీపాలతో అలంకరించారు. క్రైస్తవులంతా మినీ క్రిస్మస్ ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ఎదుట స్టార్ దీపాలను ఏర్పాటు చేశారు. కొత్త బట్టలు, తదితర వస్తువుల కొనుగోళ్లతో స్థానిక మార్కెట్‌లలో సందడి నెలకొంది.

రామేశ్వరంలో పూజా సామగ్రి విక్రయ వేలం

షాద్‌నగర్‌రూరల్: రామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈఓ రామశర్మ ఆధ్వర్యంలో గురువారం వేలం నిర్వహించారు. 2024 ఫిబ్రవరి 1నుంచి 2025 జనవరి31 వరకు కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోర అమ్మకాల కోసం వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రికి సంబంధించి రాయికల్‌కు చెందిన సతీశ్ రూ.30లక్షలు, లడ్డు, పులిహోరకు రామేశ్వరానికి చెందిన లింగం రూ.20,35,000, శివరాత్రి సందర్భంగా ఒక నెల తలనీలాలు సేకరించుటకు షాద్‌నగర్‌కు చెందిన ఆంజనేయులు రూ.1,51,000లకు టెండర్ దక్కించుకున్నారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, దేవాలయ ధర్మకర్త ప్రభాకర్‌రావు, ఆలయ ప్రధానఅర్చకులు ప్రాణాచార్యులు, ఎంపీటీసీ అరుణవెంకట్‌రెడ్డి, సర్పంచ్ సంపత్ కుమార్, ఉప సర్పంచ్ సురేశ్‌కుమార్, మోహన్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి,, హన్మంత్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధే మోదీ ధ్యేయం

షాద్‌నగర్‌రూరల్: దేశాభివృద్ధి పేదల సంక్షేమమే ప్రధాని నరేంద్రమోదీ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు అందెబాబయ్య అన్నారు. గురువారం బూర్గుల, దూసకల్, ఎలికట్ట గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అందెబాబయ్య మాట్లాడుతూ ప్రపంచంలో దేశాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. దేశాన్ని అభివృద్ధి చేయడంతో పాటుగా ప్రజల ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. దేశంలో ప్రతిఒక్కరికి కేంద్ర ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందని, ఈ విషయంపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న బీమాసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటే మరణాంతరం ఆ కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ నిషాంత్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్యులు జగదీశ్వర్, స్రవంతి, ఏఈఓలు తేజ్‌కుమార్, నిఖిల్, పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి బదిలీ సాధారణం

ఇన్‌చార్జి మండల విద్యాధికారి మనోహర్


ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకుడు

కేశంపేట: ఉద్యోగులకు బదిలీ సర్వ సాధారణంగా ఉంటుందని ఇన్‌చార్జి మండల విద్యాధికారి మనోహర్ అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన వెంకటయ్యగౌడ్ శంషాబాద్ మండలానికి బదిలీ అయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడికి వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మండల విద్యాధికారి మనోహర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృతి పవిత్రమైనదన్నారు. విద్యార్థులను సన్మార్గంలో తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో వెంకటయ్యగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్, జగదీశ్వర్‌రెడ్డి, అబ్దుల్‌బారీ, సంతోష్‌బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె రామస్వామి


మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల: ఈ నెల 26న నిర్వహించనున్న సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని జిల్లా కార్యవర్గసభ్యులు కె రామస్వామి అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గురువారం సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 98 ఏళ్లు పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా అన్ని మండల కేంద్రాల్లో, గ్రామాల్లో పార్టీ శ్రేణులు, కార్మికులు, కర్షకులు, రైతులు ప్రజా సంఘాల నాయకులు మహిళా సంఘం నాయకురాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన నూతన గ్రామ శాఖలు ఏర్పాటు చేస్తామని నూతన కమిటీలను ఎన్నుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ పార్టీ పటిష్టతకోసం పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ప్రభులింగం, రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు ఎం సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండలప్రధాన కార్యదర్శి డి శివయ్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె అంజయ్య, మండల సహాయ కార్యదర్శి ఎండీ మక్బుల్, డాక్టర్ శౌరీలు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల, విజయమ్మ, అంజిరెడ్డి, కృష్ణ, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి


కలర్ ప్రింటర్ అందజేస్తున్న మంగళి వెంకటేశ్

- దాత, యువనాయకుడు మంగళి వెంకటేశ్
- ఆలూరు పాఠశాలకు ప్రింటర్ అందజేత

చేవెళ్ల: గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని దాత, యువనాయకుడు మంగళి వెంకటేశ్ అన్నారు. ఆలూరు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల ఉపయోగార్థం కలర్ ప్రింటర్‌ను మంగళి వెంకటేశ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రింటర్ అవసరం ఉందని ఉపాధ్యాయులు తనదృష్టికి తేవడంతో తనవంతు సాయం అందజేశానన్నారు. విద్యాభివృద్ధితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల బలోపేతానికి గ్రామస్తుల సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ యాజమాన్యం, గ్రామ నాయకులు శివరాజు, మహేశ్, పెస్కారి రాజు, సీహెచ్ సురేశ్, హైమద్‌తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతాం

విద్యుత్ శాఖ డీఈఈ శివశంకర్



విద్యుత్ వినియోగదారుల సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఈఈ శివశంకర్

షాబాద్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడుతామని విద్యుత్ శాఖ డీఈఈ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలపై మొత్తం 42 ఫిర్యాదులు అందినట్లు డీఈఈ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నాతాధికారుల ఆదేశానుసారం గ్రామాల్లో విద్యుత్ సమస్యలు నేరుగా తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వ్యవసాయ బోర్లకు సంబంధించి కొన్ని ఫిర్యాదులు రాగా, గ్రామంలో కొన్ని విద్యుత్ సమస్యలపై తమకు ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. విద్యుత్ సమస్యలపై ప్రజలు, రైతులు ఫోన్‌లు చేస్తే సంబంధిత అధికారులు, సిబ్బంది వెంటనే స్పందిచాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. డీడీలు కట్టిన రైతులకు వ్యవసాయ బోర్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లు రాలేదని, స్తంభాలు వేయలేదని ఆందోళన చెందాల్సి అవసరం లేదని, వారి వివరాలను పరిశీలించిన తర్వాత ఒక్కొక్కటిగా పనులు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏడీ స్వామి, ఏఈ నరేందర్, సర్పంచ్ పీసరి అనితా సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సింధు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాహస క్రీడల శిబిరానికి రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: జాతీయ సాహస క్రీడల శిక్షణ శిబిరానికి కంటింజెంట్ లీడర్‌గా షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ నెల 30నుంచి జనవరి 8 వరకు షిమ్లాలో కేంద్ర వయోజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాహస క్రీడల శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి సాహస క్రీడల శిక్షణకు కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాల నుంచి విద్యార్థులను ఎంపిక చేసింది. ఈ క్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి 10మంది ఎంపికయ్యారని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, పాలమూరు విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణలు సామ రవీందర్ రెడ్డిని అభినందించారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి


షాద్‌నగర్: పూజలో పాల్గొన్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం లక్ష్మీనర్సింహ్మ కాలనీలోని శ్రీ శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో బీజేపీ నేత మల్చాలం మురళీ అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్యలు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మరి భూపాలాచారి, వంశీ కృష్ణ, చెట్ల వెంకటేశ్, రుషికేశ్, శ్రీనివాస్‌చారి, హరిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ హనుమాన్ దేవాలయ ఆవరణలో మహాపడి పూజను మహేందర్‌గురుస్వామి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి సురేష్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు, హిమాయత్‌నగర్ సర్పంచ్ మంజులరవియాదవ్, ముదిగొండ రాజయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు శ్రీహరియాదవ్, ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, బిస నర్సింహ్మ, పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని ‘అంగన్‌వాడీ’

- నిర్మించి ఇరువై ఏళ్లు
- శిథిలావస్థకు చేరిన భవనం


శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం

కొందుర్గు: ప్రభుత్వ భవనాలు లేకపోవడం, నూతన భవన నిర్మాణానికి నిధులకొరత దీంతో అద్దె గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో కొందుర్గు మండల కేంద్రంలోని దళితవాడలో అంగన్‌వాడీ భవనం నిర్మించి దాదాపు ఇరవై ఏళ్లు పూర్తయినప్పటికి ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరింది. దీంతో ఇక్కడ అంగన్‌వాడీకి సొంత భవనం లేక నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే వారు లేరు. ఇరువై ఏళ్లుగా ప్రయివేట్ భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తూ అవస్థలు పడుతున్నారు. కొందుర్గులో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో రెండిటికీ ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఎంపీపీ బస్వరాజ్‌గౌడ్ హయాంలో 2006లో ఎంపీటీసీ పెంటమ్మ అభ్యర్థన మేరకు రూ.4.5 లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం 2010లో ఈ భవనం పూర్తయ్యింది. కాని ఈ భవనాన్ని నేటికి ప్రారంభించ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకరావాలని స్థానికులు కోరారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతాం

- కాంగ్రెస్ ఎస్టీసెల్ కో ఆర్డినేటర్ రఘు
- బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యం


మాట్లాడుతున్న రఘు

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని ఎస్టీసెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదని, చేసిన వాగ్దానాలను అమలు చేసి తీరుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో రెండు పథకాలను అమలు చేశామన్నారు. రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని ప్రజలందరు సంతోషంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు గత పాలనలోని తమ తప్పులను కప్పి పుచ్చుకునేందుకు అసెంబ్లీ సమావేశాలలో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ కేసీఆర్ పాలనలో అప్పుల తెలంగాణగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పీసీసీ సభ్యులు మహ్మద్ అలీఖాన్‌బాబర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ పంచాయితీరాజ్, ఇరిగేషన్, విద్యుత్‌శాఖలను పూర్తిగా నిర్వీర్యం చేశారని గుర్తు చేశారు. పరీక్షలు రాయకుండా పేపర్‌లను లీక్‌చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలను పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక నేరాలకు పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరు బసవేశ్వర్, శ్రీను నాయక్, కదీర్, గంగనమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న అభిమానులు

షాద్‌నగర్: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను గురువారం షాద్‌నగర్ పట్టణంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. సీఎం జగన్ వీరాభిమాని శీలం శ్రీను ఆధ్వర్యంలో అభిమానులు కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ఆర్ అడుగు జాడల్లో నడుస్తూ, ఆయన ఆశయ సాధనకు ఏపీ సీఎం జగన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అభిమానులు పత్తి సంతోష్, కుమార్, ఆశ శివ, రఘు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

షాబాద్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకులు మధుసూదన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం ప్రతి గ్యారెంటీని అమలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, లింగం, కూర వెంకటయ్య, మాసయ్య, గౌరీశ్వర్ పాల్గొన్నారు.